జవహర్‌నగర్‌లో అమ్మమాట - అంగన్‌వాడీ బాట



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ రాజీవ్‌గాంధీనగర్‌లో మంగళవారం అమ్మమాట - అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి అల్వాల్ ప్రాజెక్టు అధికారిని స్వాతి హాజరై మాట్లాడుతూ.. 3 నుంచి 6 సంవత్సరాల చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలన్నారు. చిన్ననాటి నుంచే విద్యా బోధనలు అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ధనలక్ష్మి, టీచర్ మునిష, ఆయ, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ పోచారం ప్రధాన కార్యదర్శిగా కోన మల్లేష్



కోన మల్లేష్

పోచారం: భారతీయ జనతా పార్టీ పోచారం మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శిగా అన్నోజిగూడకు చెందిన కోన మల్లేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై ఎంతో విశ్వాసంతో పదవీ బాధ్యతలు అప్పగించిన అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పిలుపు మేరకు చేపట్టే ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటానన్నారు. అదేవిధంగా పార్టీని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

బొంతు రామ్మోహన్‌కు అభినందనల వెల్లువ



బొంతు రాంమోహన్‌కు అభినందనలు తెలుపుతున్న చర్లపల్లి కాంగ్రెస్ నేతలు

కుషాయిగూడ: టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్‌కు అభినందనల వెల్లువ కొనసాగుతోంది. చర్లపల్లి డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ శ్రేణులు కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానంలో నాథంగౌడ్

బోడుప్పల్: లయన్ దాస నర్సయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఇన్‌పేషెంట్ అటెండర్లకు మేడిపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాథంగౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పల్లె బాలరాజ్‌గౌడ్, లయన్ రామకృష్ణ, మాచర్ల కిశోర్ కుమార్, శంకర్, శ్రీను, కుమార స్వామి, రాజశేఖర్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శివకుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలు



శివకుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: బీఆర్ఎస్ సీనియర్ నేత పాండాల శివకుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ఆయనతో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఆయనతో పాటు చర్లపల్లికి చెందిన బీఆర్ఎస్ శ్రేణులు ఆయనకు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు.

వైభవంగా మల్లన్న ఆలయ వార్షికోత్సవం

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మల్లికార్జుననగర్‌లోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయం 28వ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి కుష్మాండబలి, ధ్వజారోహణం, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, మండపారాధన, హోమం, శాంతి కల్యాణం, శిఖర అభిషేకం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ముగ్గురికేనా?

టీపీసీసీలో అన్ని ప్రాంతాలకు దక్కని చోటు

- ప్రధాన కార్యదర్శిగా పీసరి మహిపాల్‌రెడ్డి
- ఉపాధ్యక్షులుగా బొంతు రామ్మోహన్, బండి రమేష్
- నిరాశలో పలు ప్రాంతాల నేతలు



బొంతు రామ్మోహన్ (ఉప్పల్, ఉపాధ్యక్షుడు) | బండి రమేష్ (ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి) | పీసరి మహిపాల్‌రెడ్డి (మేడ్చల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి)

కుత్బుల్లాపూర్: తెలంగాణ పీసీసీ జంబో కార్యవర్గంలో మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి ఏ ఒక్కరికీ అవకాశం కల్పించకపోవడంతో కార్యకర్తలు నిరుత్సాహానికి గురయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఐదు నియోజకవర్గాలు ఉండగా కేవలం మూడు నియోజకవర్గాలకు సంబంధించిన నాయకులకు చోటు కల్పించారు. మేడ్చల్ నియోజకవర్గం నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా పీసరి మహిపాల్‌రెడ్డి, ఉప్పల్ నుంచి బొంతు రామ్మోహన్, కూకట్‌పల్లి నుంచి బండి రమేష్‌లకు టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా చోటు కల్పించి మిగతా రెండు నియోజకవర్గాల్లో ఏ ఒక్కరికీ అవకాశం కల్పించలేదు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మంగళవారం 27 మంది ఉపాధ్యక్షులు, 69 మంది ప్రధాన కార్యదర్శులను ఎంపిక చేశారు. రెండు నియోజకవర్గాల్లో నాయకులు చేయి చూపడంపై అయోమయంలో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌తో పాటు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కొలను హనుమంత్‌రెడ్డిలకు పదవులు వస్తాయని ఆశించారు. అదేవిధంగా మల్కాజిగిరి అసెంబ్లీ నుంచి పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు పార్టీ కీలక బాధ్యతలు అప్పగిస్తుందని భావించి నిరుత్సాహానికి గురయ్యారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ద్వితీయ శ్రేణి నాయకులు సైతం టీపీసీసీ కార్యవర్గంలో చోటు దక్కుతుందన్న ఆశతో టీపీసీసీ కార్యవర్గంలో చోటు దక్కుతుందని ఎంతో ఆత్రుతగా ఎదురుచూసినా ఫలితం లేకుండా పోయింది. గతంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నలుగురికి ప్రధాన కార్యదర్శులుగా అవకాశం కల్పించి ఈసారి అధిష్టానం మొండి ఉన్నప్పటికీ ఫలితం తారుమారైంది.

మేడ్చల్ అసెంబ్లీ నుంచి యువకుడికి అవకాశం

మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన పిసరి మహిపాల్‌రెడ్డి పార్టీ అధికారంలో లేనప్పటికీ అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థి సంఘం నాయకుడిగా యూత్ కాంగ్రెస్ పక్షాన ఎన్నో ప్రజా సమస్యలపై పోరాడుతూ వచ్చాడు. 2006లో ఎన్ఎస్‌యుఐలో కీలకంగా పనిచేసి శామీర్‌పేట్ మండల అధ్యక్షుడిగా, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, మేడ్చల్ అసెంబ్లీ అధ్యక్షుడిగా కొనసాగారు. 2015 సంవత్సరంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీచేసి ప్రస్తుత ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ చేతిలో స్వల్ప ఓట్లతో ఓటమి పొందారు. యువకుడిగా ఉన్న మహిపాల్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన కార్యవర్గంలో రాష్ట్ర కార్యదర్శిగా నియమించి గుల్బర్గా జిల్లా ఎన్నికల పరిశీలకుడిగా పంపారు. అదేవిధంగా జూబ్లీహిల్స్, నల్లగొండ జిల్లాలో ఎలక్షన్ సమయంలో పరిశీలకులుగా వ్యవహరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్పొరేషన్ చైర్మన్ పదవి వస్తుందని జిల్లావ్యాప్తంగా చర్చ జరిగినా ఆ పదవి వరించలేదు. యువకుడిగా చురుగ్గా పనిచేస్తున్న మహిపాల్‌రెడ్డి పేరును రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ప్రతిపాదించినట్లు తెలిసింది. కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి గతంలో పోటీ చేసి ఓడిపోయిన బండి రమేష్, ఉప్పల్ సీటు ఆశించి భంగపడ్డ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కు ఉపాధ్యక్ష పదవులు కట్టబెట్టారు.

చెత్త కంపోస్టింగ్‌పై ప్రజలకు అవగాహన



కంపోస్టింగ్‌పై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ చంద్రశేఖర్

పోచారం: రాష్ట్ర ప్రభుత్వం చేడుతున్న వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో నూతనంగా విలీనమైన మరిపల్లిగూడలో 'తడిచెత్త - పొడి చెత్త - కంపోస్టింగ్, జంతు జనన నియంత్రణ'పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఒక మార్పు.. అభివృద్ధికి మలుపు' అనే నినాదంతో మరిపల్లిగూడలో ర్యాలీ తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఒక గ్రామాన్ని ఒకే వార్డుగా విభజించాలి



ఎల్లంపేట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: గ్రామాల విలీనంతో ఏర్పడ్డ ఎల్లంపేట్ మున్సిపాలిటీలో వార్డులు ఒక ప్రాంతం ఒక వార్డు కిందే ఉండేలా వార్డుల విభజన చేయాలని బీజేపీ మున్సిపల్ నాయకులు కమిషనర్ నిత్యానంద్‌ను కోరారు. వార్డుల విభజనపై మున్సిపల్ కమిషనర్‌కు మంగళవారం బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఒక గ్రామం సగం, మరో గ్రామం సగం ఒక వార్డు కింద ఏర్పాటు చేయకుండా ఒక గ్రామం మొత్తం ఒకే వార్డు కిందకు వచ్చేలా వార్డులు ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎల్లంపేట్ మాజీ సర్పంచ్ జగన్‌గౌడ్, నాయకులు రమేష్, మహేష్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

యాద్గార్‌పల్లిలో బడిబాట



యాద్గార్‌పల్లిలో బడిబాటలో ఎంఈవో జమదగ్ని, ఉపాధ్యాయులు

కీసర: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా మంగళవారం యాద్గర్‌పల్లి ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో జరుగుతున్న బడిబాట కార్యక్రమాన్ని మంగళవారం ఎంఈవో జమదగ్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారు మాత్రమే అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల గొప్పదనం, నాణ్యమైన విద్య, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పుష్పకళ, సత్తిరెడ్డి, ఉపాధ్యాయులు కౌసల్య, యాదగిరి, సతీష్‌కుమార్, జమున, అంగన్‌వాడీ టీచర్ మంజుల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గోవులను తరలిస్తున్న వారిపై కేసు నమోదు

- రవాణా సక్రమమని తేలడంతో కేసు వెనక్కి
- గోవులు, వాహనాన్ని తీసుకెళ్లాలంటున్న పోలీసులు
- ఇబ్బందులకు గురిచేశారని అంటున్న బాధితులు

కుషాయిగూడ: ఆవులు తరలిస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆవులను కబేళాలకు తరలిస్తున్నారన్న అనుమానంతో వారిపై కేసు నమోదు చేశారు. ఆవులను గోశాలకు తరలించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. తీరా పోలీసుల విచారణలో ఆవుల రవాణా సక్రమం అని తేలడంతో కేసు లేకుండా చూడాలని భావించినా గోశాల నిర్వాహకులు సహకరించలేదు. ఈ ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వారం రోజుల క్రితం చోటు చేసుకుంది. బాధితులు స్టేషన్ చుట్టూ తిరుగుతుండటంతో విషయం బయటకు వచ్చింది. ఈ నెల 3న ఈసీఐఎల్ నుంచి బొల్లారం వైపుగా రెండు ఆవులు, రెండు దూడలతో వెళ్తున్న ఓ వాహనాన్ని కుషాయిగూడ పోలీసులు అడ్డుకున్నారు. వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఆ సమయంలో ఆవులను కబేళాలకు తరలించడం లేదని, కొండమడుగు పశువుల సంతలో కొనుగోలు చేసి బొల్లారంలోని డైరీకి తీసుకెళ్తున్నామని చెప్పినా పోలీసులు పట్టించుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. తీరా వారి వద్ద ఉన్న ఆధారాలను పోలీసులకు సమర్పించడంతో కేసు క్లోజ్ చేయాలని భావించి గోశాల నిర్వాహకులతో మాట్లాడగా వారు సహకరించలేదని సమాచారం. దీంతో చట్టప్రకారం ఆవులు, వాహనాన్ని తీసుకెళ్లాలని పోలీసులు బాధితులకు సూచించారు. ఆధారాలు పరిశీలించకుండా కేసు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. స్పందించిన కుషాయిగూడ పోలీసులు ఇరుకు వాహనంలో మూగజీవాలను క్రూరంగా తరలిస్తున్నారన్న ఆరోపణలపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా అల్వాల్ సర్కిల్ పరిధిలో మౌలిక వసతులు కల్పించాలని, మొహర్రం ఏర్పాట్లకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటాపురం కార్పొరేటర్ సబితఅనిల్‌కిషోర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో సెక్యూరిటీ గార్డు మృతి



గుంటా రమేష్ (ఫైల్)

పోచారం: ఆర్థిక ఇబ్బందులతో ఓ సెక్యూరిటీ గార్డు మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్‌లోని బ్రూక్ బాండ్ కాలనీలో నివసిస్తున్న గుంటా రమేష్(39) బోడుప్పల్‌లోని లైఫ్ స్ప్రింగ్ హాస్పిటల్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో రమేష్ ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారి సహాయంతో తలుపులు తెరిచి రమేష్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి రమేష్ చనిపోయినట్లు ధ్రువీకరించారు. ఆర్థిక ఇబ్బందులే అతడి మృతికి కారణమని తెలుస్తోంది. మృతుడి అన్న ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తలసాని శంకర్ యాదవ్ విగ్రహ ఆవిష్కరణ

శామీర్‌పేట్: కార్మికుల సంక్షేమం కోసం తలసాని శంకర్ యాదవ్ ఎంతో కృషి చేశారని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తుర్కపల్లి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు మోండా మార్కెట్ వర్తకుల సంఘం అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో మంగళవారం పాల్గొన్నారు. ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన తలసాని శంకర్ యాదవ్ విగ్రహాన్ని మాజీ మంత్రులు మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి హరీష్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, తలసాని శంకర్ యాదవ్ సోదరులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

17న చలో ఇందిరాపార్కు ధర్నా



రజకుల ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వృత్తిదారులు

ఉప్పల్: రజక వృత్తి దారుల సమస్యలపై ఈ నెల 17వ తేదీన ఇందిరాపార్కు వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం రజక వృత్తి దారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుభద్రమ్మ, జ్యోతి ఉపేందర్‌ల ఆధ్వర్యంలో చిలుకానగర్‌లో కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన ఉచిత విద్యుత్ బిల్లులు పేరుకు పోయాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 15 నెలలు గడిచినా బిల్లులు మాత్రం చెల్లించడం లేదని విమర్శించారు. దీంతో విద్యుత్ అధికారుల బెదిరింపులకు రజకులు ఆందోళన పడుతున్నారని, వీటిని పరిష్కరించుకోవడానికి నిర్వహించే ధర్నాకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని కోరారు.

ఇందిరమ్మ పథకంతో సొంతింటి కల సాకారం

టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్



కీసరలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తోటకూర వజ్రేష్‌యాదవ్

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని కీసరలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ హాజరై లబ్ధిదారులతో కలిసి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు, గూడు లేనివారికి సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ పథకం లక్ష్యమని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇందిరమ్మ పథకం ద్వారా పేదలకు రూ.5 లక్షలు అందించి, సొంతింట్లో ఉండే అవకాశాన్ని కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కీసర మండల అధ్యక్షుడు కోలా కృష్ణయాదవ్, కాంగ్రెస్ దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షుడు ముప్పు రామారావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఈగ శ్వేతముదిరాజ్, వేణు, మున్సిపల్ నాగమణి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రామిడి స్వప్నవిజయ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, భిక్షపతి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కందాడి శ్రావణ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ కీసర మండల అధ్యక్షుడు చీర వినోద్, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి



గిర్మాపూర్ సదస్సులో రైతు ఫిర్యాదును పరిశీలిస్తున్న ఆర్‌డీఓ ఉపేందర్‌రెడ్డి

మేడ్చల్: నూతన చట్టం భూభారతిపై రైతులకు అవగాహన కలిపించి వారి సమస్యలను తెలుసుకోవడానికి నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కీసర డివిజన్ ఆర్‌డీఓ ఉపేందర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్‌లో మంగళవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. రైతుల సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వాటి పరిష్కారం కోసం అధికారులు అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. రైతులతో మాట్లాడి, వారు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. సమావేశంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సునీల్‌కుమార్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ,గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే చెత్త.. ఇలా చేస్తే ఎట్లా..?



కిష్టాపూర్ వాగు వద్ద రోడ్డుపక్కన వేసిన చెత్త

మేడ్చల్‌రూరల్: పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో మేడ్చల్ మున్సిపాలిటీ స్వచ్ఛ మేడ్చల్‌కు ఆమడ దూరంలో ఉంది. కాలనీల్లోని ఖాళీ ప్రదేశాలతో పాటు రోడ్డు పక్కన.. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తుండటంతో పరిసరాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టడంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది అలసత్వం వహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కంపు కొడుతున్న కిష్టాపూర్ రోడ్డు..

మేడ్చల్ పట్టణం నుంచి కిష్టాపూర్ వెళ్లే రోడ్డులో రోడ్డు పక్కనే చెత్త పడేయడంతో పాటు వ్యర్థాలు పారబోస్తుండటంతో ఆ రోడ్డుపై ప్రయాణించేవారు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి. కిష్టాపూర్ వాగు వద్ద రోడ్డు పక్కనే చెత్త వేయంతో పాటు దుకాణదారులు, చికెన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాలను వేస్తుండటంతో చిన్నపాటి డంపింగ్ యార్డుగా మారింది. ఓ పక్క వాగులో మురుగు ప్రవాహం, మరోపక్క కేఎల్ఆర్ కమాన్ నుంచి కిష్టాపూర్ వాగు వరకు రోడ్డు పక్కనే బహిరంగ మురుగు కాల్వ ప్రవాహంతో దుర్వాసన వస్తోంది. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మున్సిపల్ శానిటరీ విభాగం పట్టించుకోవాలని, దుకాణదారులు చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లి నిమిషాంబదేవి



మాధవీలతకు అమ్మవారి పటాన్ని అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

బోడుప్పల్: భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లిగా నిమిషాంబదేవి పూజలు అందుకుంటున్నారని హైదరాబాద్ పార్లమెంట్ కాంటెస్టెడ్ మెంబర్ కొల్లి మాధవీలత అన్నారు. పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబదేవి 19వ వార్షిక బ్రహ్మోత్సవ ముగింపు వేడుకలకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన గణపతి పూజ, పుణ్యాహవచనం, ఆవాహిత దేవత హోమం, బలి ప్రధానం, అమ్మవారికి పంచామృతం, 56 రకాల పండ్ల రసాలతో, సుగంధ ద్రవ్యాలతో నిజాభిషేకం, అమ్మవారికి పల్లకీ సేవ ఊరేగింపు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీవిద్యారణ్య భారత స్వామీజీ వారి కరకమలంచే పూర్ణాహుతి, కలశ ఉద్వాసన నిర్వహించారు. కార్యక్రమంలో బోడుప్పల్ కమిషనర్ శైలజ, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, బోడుప్పల్ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, ఆలయ చైర్మన్ వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, అశోక్ కుమార్, కోశాధికారి రమేష్, నకాష్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిచర్ల శ్రీనివాస్‌రావు, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్‌శర్మ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారమే ప్రభుత్వ లక్ష్యం

టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్



ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేస్తున్న వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: పేదల కల సాకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లో 13, 27, 28 డివిజన్‌ల్లో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయాలన్నది కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తోందన్నారు. ఇప్పటి వరకు 19 ఇళ్లకు ముగ్గు పోసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లు వెల్లడించారు. మూడు ఇళ్లకు మంగళవారం శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బోడుప్పల్ కమిషనర్ శైలజ, ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణమూర్తి, బోడుప్పల్ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, ఏఈ అల్లాజీ, మాజీ కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, దానగల్ల అనిత యాదగిరి తదితరులు పాల్గొన్నారు.